క్లుప్తంగా

మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానం

ఒంగోలు: మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానం అని కేవీఎస్‌టీ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి డాక్టర్ కొప్పోలు సురేష్ అన్నారు. బుధవారం స్థానిక గద్దలగుంటలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల మెటీరియల్ ఉచితంగా అందించారు. విద్యార్థులకు భవిష్యత్తులో కూడా తమ ట్రస్టు తరఫున తప్పక సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చలపతిరావు, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, డ్రిల్ మాస్టర్ సోమినేని సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

చీమకుర్తి: పింఛను తీసుకుంటున్న వారు జనవరి 1వ నుంచి ఫిబ్రవరి 29 వరకు లైఫ్ సర్టిఫికెట్లను సబ్ ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని చీమకుర్తి మండల పింఛనుదారుల సంఘం ప్రెసిడెంట్ మర్రి లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుబాటులో ఉన్న మీసేవా కేంద్రాల ద్వారా కూడా లైఫ్ సర్టిఫికెట్లను పొందవచ్చని తెలిపారు. పీపీఓ నంబర్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతానెంబర్, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లను పొందవచ్చని తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: పాటిమీదపాలెంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను అద్దంకి వైఎస్సార్ సీపీ పరిశీలకులు మారం వెంకారెడ్డి బుధవారం ప్రారంభించారు. సంక్రాంతి పండగ సందర్భంగా పాటిమీదపాలెం అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. మారం వెంకారెడ్డి క్రీడాకారులను చైతన్యపరిచే ఉపన్యాసం చేశారు. నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం రేపు

ఒంగోలు: మందాడి శ్రీనివాసరెడ్డి మెమోరియల్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అపెక్స్ హైస్కూలు కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న ఉదయం 9.30 గంటలకు స్థానిక సుజాత నగర్ 11వ లైనులోని తమ పాఠశాల గ్రౌండులో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో కంటి, స్త్రీ, జనరల్ వైద్య నిపుణులు ఉచిత వైద్య సేవలు అందిస్తారన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

ఒంగోలు మెట్రో: స్థానిక సీతారాంపురం లో వెలసి ఉన్న వరాల నాగేంద్ర స్వామికి పూజా క్రతువులు నిర్వహించి స్వామి అమ్మవార్ల కల్యాణ క్రతువును బుధవారం జరిపించారు. భక్తులతో యాగ్నికని నిర్వహించారు.

జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ఒంగోలు టౌన్: ఆధునిక భారత దేశంలో మహిళా విద్య కోసం పాటు పడిన సావిత్రిబాయి పూలే, షేక్ ఫాతిమా జయంత్యుత్సవాలను జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ నిర్వహించాలని బహుగ్రంథ రచయిత, ముస్లిం పోరాట యోధుల చరిత్ర రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ పిలుపునిచ్చారు. బుధవారం కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని దోస్తీ ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధునిక భారత దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జనవరి 3న జన్మించగా, ఫాతిమా షేక్ జనవరి 9వ తేదీన జన్మించారని తెలిపారు. ఈ ఇద్దరి స్ఫూర్తిని కొనసాగించేందుకు దేశంలోని బహుజన, మైనారిటీ ముస్లిం వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఫాతిమా షేక్ చరిత్రను పాఠ్యాంశంగా పెట్టడం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణలో కూడా పాఠ్యాంశంలో చేర్చిందని, దేశంలోని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఫాతిమా షేక్ చరిత్రను పాఠ్యాంశంగా చేర్చేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు పట్టణంలో ఫాతిమా షేక్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 6 ప్రాంతాల్లో ఆమె విగ్రహాలను ఏర్పాటు చేయడం విశేషమని చెప్పారు. అలాగే కర్నూలుకు చెందిన నల్లగట్ల శ్రీనివాసులు తన సొంత ఖర్చులతో మహాత్మ జ్యోతి రావు పూలే, దాదాసాహెబ్ అంబేద్కర్ , సావిత్రి బాయి పూలే, ఫాతిమా షేకశ్ విగ్రహాలను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారని, ఆసక్తి గల బహుజన నలగట్ల శ్రీనివాసులును సంప్రదించవచ్చన్నారు. తెలుగులో తాను రచించిన


మాట్లాడుతున్న ప్రముఖ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్, షేక్ మహబూబ్


కొత్తపట్నంలో జయంతి వేడుకలు

ఫాతిమా షేక్ పుస్తకం ప్రస్తుతం దేశంలో కన్నడ, గుజరాతి, ఉర్దూ, హిందీ, ఇంగ్లిషు తదితర 6 భాషల్లో అనువాదం చేసినట్లు వివరించారు. అనంతరం రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ రచయిత నశీర్ అహమ్మద్‌ను ఘనంగా సత్కరించారు. బహుజన అధికారుల, ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎంఏ సాలార్, నత్తల శ్రీనివాసులు పాల్గొన్నారు.

చీమకుర్తి: భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.జవహర్, బీసీ సంఘ రాష్ట్ర నాయకులు బత్తుల మల్లికార్జున, స్థానిక హైస్కూలు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, పిన్నిక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒంగోలు: దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక దత్తాత్రేయ కాలనీలో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. డీబీఆర్‌సీ ఒంగోలు సిటీ కోఆర్డినేటర్ గుత్తి కోటేశ్వరరావు మాట్లాడుతూ మహాత్మాజ్యోతి రావు పూలే, సావిత్రీబాయి పూలే ఇద్దరూ స్త్రీలు, బహుజనుల అభివృద్ధికి, అక్షరాస్యతకు అనేక పాఠశాలలు స్థాపించారన్నారు. మొట్టమొదటి కులాంతర వివాహాన్ని కూడా జరిపించి ఆదర్శంగా నిలిచారని వివరించారు. మిచాంగ్ తుఫాను కారణంగా ఇళ్లు కారుతున్న దృశ్యాలను గమనించి దత్తాత్రేయ కాలనీ వాసులు 8 మందికి టార్పాలిన్ పట్టలను అందించారు. డీబీఆర్‌సీ సిటీ కోఆర్డినేటర్ గుత్తి కోటేశ్వరరావు మహిళల రక్షణ చట్టాల గురించి, వారికి ఉన్న హక్కుల గురించి తెలియజేశారు.

ఒంగోలు మెట్రో: దేశంలో మహిళల అక్షరాస్యత కోసం నిరంతరం కృషిచేసిన మహామనిషి సావిత్రిబాయ్ పూలే ఆశయాలు కొనసాగిస్తామని పలువురు పేర్కొన్నారు. వేదిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక దేవుడి చెరువులోని సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సావిత్రిబాయ్ పూలే జయంతి కార్యక్రమం జరిగింది. ఫౌండేషన్ అధ్యక్షురాలు షేక్ సిద్దాం బి. ఆలిండియా కళారంగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, మహిళా కమిషన్ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి, షేక్ సిద్దాంబి కళారంగ జిల్లా అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, గురువారెడ్డి తమ్మిశెట్టి రమాదేవి పాల్గొన్నారు.

కొత్తపట్నం: స్థానికి బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంతి జ్యోతి సావిత్రి బాయి పూలే 194వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు పుష్పాంజలి ఘటించారు. ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి సావిత్రిభాయి పూలే గురించి పాట రూపంలో ఆలపించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ తాము ఉపాధ్యాయలుగా చేస్తున్నామంటే పూలే వలనే అని కొనియాడారు. ఉపాధ్యాయురాలు ఝాన్సీ మాట్లాడుతూ పూలే సహాయంతో మహిళలకు, వయోజనులకు పాఠశాలలు స్థాపించారన్నారు. ఎంఈవో 1, 2 తులసి, పద్మావతిలను, సీనియర్ ఉపాధ్యాయురాలు ధనజ్యోతి, వసంతిలను సన్మానించారు. సెక్రటరీ హరిబాబు, కోటేశ్వరరావు, శరత్‌చంద్ర, కృష్ణమూర్తి, నాగమల్లేశ్వరరావు, శేషగిరి, జిలాని, కృష్ణయ్య, రమేష్ పాల్గొన్నారు.


దత్తాత్రేయ కాలనీ వాసులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ చేస్తున్న గుత్తి కోటేశ్వరరావు


చీమకుర్తి: సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న డాక్టర్ జవహర్


సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేదిక ఫౌండేషన్ సభ్యులు

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


దశరాజుపల్లెలో పెన్షన్ అందజేస్తున్న సర్పంచ్


సర్వేరెడ్డిపాలెంలో అందజేస్తున్న కార్యదర్శి భాగ్యలక్ష్మి, నాయకులు

ఒంగోలు రూరల్: సంక్షేమ పథకాల అమల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా ఉందని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి అన్నారు. రూరల్‌లోని యరజర్లలో పెన్షన్‌ల పెంపు కార్యక్రమం సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ శ్రీనివాసులు అధ్యక్షతన ఎంపీడీవో పి.అజిత కన్వీనర్‌గా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెన్షన్ సరిపోవడంలేదని గుర్తించిన ముఖ్యమంత్రి రూ.2750 నుంచి రూ.3000కు పెంచడం హర్షణీయమన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నీ వర్గాలను దృష్టిలో ఉంచుకుని పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నవరత్నాలు అమలు చేస్తున్నారన్నారు. తమ్మిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ త్వరలో నగరం, రూరల్ పరిధిలోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైస్ సర్పంచ్ హరిబాబు, ఎంపీటీసీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ మాట్లాడారు.

ఒంగోలు రూరల్: మండలంలో నూతనంగా పెంచిన పెన్షన్‌లను పలు సచివాలయాల్లో ఆయా గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. సర్వేరెడ్డిపాలెంలో కార్యదర్శి భాగ్యలక్ష్మి అధ్యక్షతన నూతన పెన్షన్‌ల పంపిణీ జరిగింది. కాకుమాని ఆదిశేషయ్య, విలేజ్ స్పెషల్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జాజుల శ్రీనివాస్ మాట్లాడారు.


యరజర్లలో నూతన పెన్షన్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

దశరాజుపల్లెలో..

సర్పంచ్ శ్రీలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన కార్యదర్శి రేవతి, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి నూతనంగా పెంచిన పెన్షన్‌లను పంపిణీ చేశారు. గతంలో జన్మభూమి కమిటీ నాయకులు ఇళ్ల వద్ద పడికాపులు కాచే రోజులు పోయి కుల, మత, వర్గ, పార్టీ రహితంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైనవారందరికీ పెన్షన్‌లు అందజేస్తుందన్నారు. కార్యదర్శి రేవతి సర్పంచ్ శ్రీలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ

ఒంగోలు టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా పామూరుకు బదిలీ అయిన సీఐ యం. రామానాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు.


ఎస్పీ మలికా గర్గ్‌కు పూలమొక్కను అందజేస్తున్న సీఐ

రూ.3 కోట్లతో తారు రోడ్డుకు శంకుస్థాపన

చీమకుర్తి: తొర్రగుడిపాడు నుంచి నేకునంబాద్ వరకు ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డుకు రూ.3 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్డుకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులతో ఈ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే తొర్రగుడిపాడు నుంచి నేకునంబాద్ వరకు 4 కి.మీ పొడవునా ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందని కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.


తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ

టీకాల కార్యక్రమం పరిశీలన

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరప్పాడు, వెల్లంపల్లి గ్రామాల్లో జరుగున్న సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి బుధవారం పరిశీలించారు. పాడి రైతులు తప్పని సరిగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. ఈనెల 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈకార్యక్రమం ప్రారంభమైందని, ఈ నెల 31 వరకు షెడ్యూల్ ప్రకారం అన్ని పాడి పశువులకు టీకాలు వేయిస్తామని తెలిపారు. ఉప సంచాలకులు పద్మావతి మాట్లాడుతూ ఈవ్యాధి వైరస్ వలన సోకుతుందని మగ పశువుల్లో పని చేసే సామర్థ్యం తగ్గిపోతుందన తెలిపారు.


పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి, డాక్టర్ మాధవీలత

సర్పంచ్ బెజవాడ రాముఎడీ సుగణ్యారావు, పశు వైద్యాధికారి మాధవీలత, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఒంగోలు రూరల్: క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి అన్నారు. యరజర్ల గ్రామ సచివాలయంలో ఆడుదాం ఆంధ్ర బహుమతి ప్రదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలు శారీరక బలాన్ని, మానసిక స్థైర్యాన్ని అందజేస్తాయని క్రీడల్లో రాణించడం ద్వారా మంచి స్థానానికి చేరుకోవచ్చని చెప్పారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పోటీలు యరజర్లలో జరిగాయని, ఈ పోటీల్లో సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ శ్రీనివాస్ యరజర్ల సచివాలయ టీం విజేతగా నిలిచిందని వారికి రూ.10000 అందజేయడం హర్షణీయమన్నారు. సర్పంచ్ రాములమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, ఈ పోటీలు విజయవంతం కావడానికి సహకరించిన ఒంగోలు ఎంపీడీవో, ఈవోఆర్డీ, కార్యదర్శి రామకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. విజేతలైన సచివాలయ టీంకు సర్పంచ్, ఎంపీపీ, ఎంపీడీవో, వైఎస్సార్ సీపీ నాయకులు, క్రికెట్ టీం కెప్టెన్ కిలారి హరికృష్ణకు, వైస్ కెప్టెన్ హరికృష్ణకు రూ.10000 అందజేశారు. ఉపసర్పంచ్ హరిబాబు, ఎంపీటీసీ శ్రీనివాసరావు మాట్లాడగా కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ క్రికెట్ టీం కెప్టెన్ హరికృష్ణ, వైస్ కెప్టెన్ ప్రసాద్, వికెట్‌కీపర్ శ్రీకాంత్, ప్లేయర్లు దుర్గ, రాజు, మోహన్, రాజు, వెంకట్రావు, డి.శ్రీకాంత్, విష్ణు, అయ్యప్ప, శ్రీనివాసులు, రాజేంద్ర, ప్రసాద్, రవి, కళ్యాణ్, సతీష్, మహేష్‌లకు పతకాలు అందజేశారు.


యరజర్లలో నగదు బహుమతి అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో, సర్పంచ్, శ్రీనివాసులు

పొగాకులో అన్యపదార్థాలు తొలగించాలి

పొన్నలూరు: పొగాకులో అన్య పదార్థాలను క్షేత్ర స్థాయిలోనే రైతులు గుర్తించి తొలగించాలని వేలం కేంద్రం నిర్వాహణాధికారి చైన్ రామ్ మీనా సూచించారు. మండలంలోని ముండ్లమూరివారిపాలెం గ్రామంలో బుధవారం ఆకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్ విధానంపై పొగాకు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు ముదురు పొగాకు తోటలు దెబ్బతినటం వల్ల అడుగు ఆకులను వదిలేసి పక్వానికి వచ్చిన వాటిని మాత్రమే రెలచాలన్నారు. ఆకు అల్లిక సమయంలో తారు బల్లలు విధిగా వాడాలన్నారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచుకుని అన్యపదార్థాలు వేయాలని చెప్పారు. అనంతరం పొగాకు తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ వెంకట్రావు, జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభం

ఒంగోలు మెట్రో: హైదరీ క్లబ్ లో స్పోర్ట్స్ కరాటే ట్రైనింగ్ సెంటర్‌ను ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కరాటే మాస్టర్ నల్లూరి మోహన్ రావు అభినందనీయుడని కొనియాడారు. ఒంగోలుకు కరాటేని పరిచయం చేసి దాదాపు 42 ఏళ్లుగా వేలాది మందిని ఛాంపియన్స్ చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, హైదరి క్లబ్ కార్యదర్శి డాక్టర్ గుండవరపు రాఘవ రావు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, ప్రకాశం జిల్లా కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, మొగిలిదేవ కరాటే మాస్టర్లు వెంకటేశ్వర్లు (కొత్తపట్నం) విజయలక్ష్మి (హైదరాబాద్ పబ్లిక్ స్కూల్) యశ్వంత్, నేషనల్ ప్లేయర్స్ పాల్గొన్నారు. వివరాలకు 9885208991, 8074706061, 9866288176 సంప్రదించాలని కోరారు.


కరాటే శిక్షణ కేంద్రంలో ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాసరావు

అటవీ శాఖకు భూమి బదలాయించాలి

● జాయింట్ కలెక్టర్‌కు ఎంపీపీ వాకా వినతి

మద్దిపూడి: పాదిలికొండ ఘాట్‌రోడ్ నిర్మాణంలో అటవీ శాఖ నష్టపోయిన భూమికి బదులుగా 909–3 సర్వే నంబరులోని 3.75 ఎకరాల భూమిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులుకు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన జేసీని ఎంపీపీ కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో పృథులగిరి లక్ష్మీనృసింహ్మస్వామి దేవస్థానానికి ఘాట్‌రోడ్ నిర్మించగా రిజర్వు ఫారెస్టుకు చెందిన 1.5 హెక్టార్ల భూమిని వినియోగించుకున్నట్లు తెలిపారు. దీనికి బదులుగా మద్దిపూడి గ్రామ సర్వే నంబరు 909–1లో అంతే భూమిని అటవీశాఖ వారికి స్వాధీనం చేసినట్లు చెప్పారు. అయితే 909–1 సర్వే నంబర్లో భూమికి బదులుగా 909–3 సర్వే నంబర్‌లో భూమిని అటవీ శాఖకు చెందేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఎంపీపీ విన్నవించారు. ఆయన వెంట సర్పంచ్ కె.భాస్కర్, బీఎల్ఎన్ శాస్త్రి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, కోండ్రు ఇబ్రాయిల్, పడిదపు వెంకటేశ్వర్లు ఉన్నారు.


జాయింట్ కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

అర్హులైన అసైన్డ్ రైతులకు సంపూర్ణ హక్కులు

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

మద్దిపూడి: జిల్లాలో అసైన్‌మెంట్ భూమి కలిగిన అర్హులైన రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని గుండ్ల సముద్రం పంచాయతీ పరిధిలోని ఎస్టీ రాజుపాలెం గ్రామం మీదుగా వెళ్తున్న రైల్వేలైన్‌ను జేసీ బుధవారం పరిశీలించారు. మద్దిపూడి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన అనంతరం జేసీ మాట్లాడుతూ.. అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇచ్చి 20 ఏళ్లు పూర్తయితే సదరు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత హక్కు కల్పిస్తుందన్నారు. మండలంలో అసైన్డ్ రైతులు ఎంత మంది ఉన్నారు? ఎంత మంది సంబంధిత పత్రాలను సచివాలయంలో అందజేశారో నిశితంగా పరిశీలించాలని తహసీల్దార్ హరిబాబును ఆదేశించారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ భూపతి, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఒంగోలు: జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డెమోక్రటిక్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు డాక్టర్ నూకతోటి రవికుమార్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 20 నుంచి 30 ఏళ్లుగా జర్నలిస్టులుగా ఉన్న వారికి, గుర్తింపు పొందిన యూనియన్లు చిన్న మధ్యతరహా, సోషల్ మీడియా, యూట్యూబ్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్లతో పాటు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 6న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని క్లబ్ రోడ్డులో చక్రాలపై కూర్చుని భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగించే ఓ అనాథ మృతి చెందాడు. ఆ శవానికి బుధవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకుడు బీఎస్ నారాయణరెడ్డి దగ్గర ఉండి అంత్యక్రియలు చేశారు.

దర్శి: మానవత సభ్యులు అనాథ వృద్ధుడి మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. వెంకటాయలం పల్లి గ్రామం వద్ద కాశీనాయన ఆశ్రమంలో అనాథ వృద్ధుడు మృతి చెందాడు. పార్థసారథి, వాసుదేవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వేణులు అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

పుల్లలచెరువు: గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఈవోఆర్డీ శరత్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్లాస్టిక్ నిషేధంపై గ్రామాల్లో కార్యదర్శి బాలునాయక్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. దుకాణ యజమానులతో ఈవోఆర్డీ శరత్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్లాస్టిక్ వస్తువుల వాడకం వద్దని, దానితో ఎన్నో ప్రమాదకర ఫలితాలు ఉన్నాయని, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వాటిని సాధ్యమైనంత వరకు వాడకుండా చూడాలన్నారు. ప్రభుత్వానికి చెల్లించే పన్నులు కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి

మార్కాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానమంత్రి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ మండల స్థాయి సమావేశాన్ని ఎంపీడీఓ తోట చందన ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సచివాలయాల కార్యదర్శులను ఉద్దేశించి ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని పెద్దనాగులవరం, జమ్మనపల్లిలో ఎస్టీ ఆవాసాలను గుర్తించి వివరాలు సేకరించాలని సూచించారు. ఆధార్ కార్డు, జాబ్‌కార్డు, ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు లేని ఎస్టీలను గుర్తించి, వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డీటీ పర్వీన్ పాల్గొన్నారు.